రైతుబజార్ల ఎస్టేట్ అధికారుల బదిలీలపై కౌన్సిలింగ్: జాయింట్ కలెక్టర్

ఏలూరు, జులై 22 (ఎపిఇఎంఎస్): పశ్చిమ గోదావరి జిల్లాలోని రైతు బజార్లలో దీర్ఘకాలంగా పని చేస్తున్న ఎస్టేట్ అధికారులకు బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీలు చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.కె.శ్రీదేవి చెప్పారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో మార్కెటింగ్ శాఖాధికారులతో రైతు బజార్ల నిర్వాహణ, కూరగాయల ధర నియంత్రణ, రైతు బజార్ల పరిపుష్టికి, మౌలిక సదుపాయాల కల్పనపై జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల తరబడి ఎస్టేట్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్నారని, అయితే కొన్ని రైతు బజార్లలో సక్రమ నిర్వాహణ కొరవడిందని, అనేక ఆరోపణలు వస్తున్న దృష్ట్యా ఎస్టేట& అధికారులను బదిలీలు చేపడుతున్నామన్నారు. దీర్ఘకాలంగా ఆయా రైతు బజార్లలో ఉన్న ఎస్టేట్ అధికారులను వారం రోజుల్లో బదిలీ చేస్తామన్నారు. వారి పనితీరు, ఎన్ని సంవత్సరాల నుండి పని చేస్తున్నదీ, తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా ఈ బదిలీలు నిర్వహిస్తామన్నారు. రైతు బజార్ల నిర్వాహణా బాధ్యత మార్కెట్ కమిటీలకు బదలాయిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ టి.కె. శ్రీదేవి చెప్పారు. సరసమైన ధరలకు కూరగాయలు, నిత్యావసర వస్తువులు వినియోగదారులకు అందించేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా చర్యలు తసీఉకోవడం జరుగుతుందన్నారు. స్థానికంగా ధరలను ఎప్పటికప్పుడు అంచనావేస్తూ ఆయా ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యే కూరగాయలు తదితర వస్తువులను దిగుమతి చేసుకుని సరసమైన ధరలకు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో ఉన్న ఆరు రైతు బజార్లలో పాలకొల్లు, కొవ్వూరు రైతుబజార్లకు సరైన వసతి లేనందున రైతు బజారు నిర్మించేందుకు స్థల సేకరణ జరపాలన్నారు. ఇందుకు మార్కెట్ కమిటీల ద్వారా ప్రతిపాదనలు సహాయ వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులకు పంపించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం రైతు బజార్లలో ఖాళీగా ఉన్న స్టాల్సును ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు అద్దె ప్రాతిపదికన కేటాయించాలని, ఆయా రైతు బజార్ల ఎస్టేట్ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఏలూరు, భీమవరం, నరసాపురం రైతుబజార్లలో శాశ్వత మరమ్మత్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతు బజార్లలోని మౌలిక సదుపాయాలను సంబంధిత వ్యవసాయ మార్కెట్ కమిటీ, ఎస్టేట్ అధికారులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ రైతు బజారులో రైతులకు కూరగాయల విత్తనాలు, ఎరువులు 50 శాతం రాయితీతో అందించేందుకు ఒక ప్రత్యేక స్టాలును ఏర్పాటు చేయాలని ఎస్టేట్ అధికారులను ఆదేశించారు. కూరగాయల ఉత్పత్తులపై ప్రతీ నెలా ఎస్టేట్ అధికారులకు, రైతులకు శిక్షణ ఇచ్చేందుకు ఉద్యానవనశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ముందుకు రావడం జరిగిందన్నారు. రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు వారి పరిధిలోని కూరగాయలు పండించే రైతుల గ్రామాలను గుర్తించి దత్తత తీసుకుని వారికి శిక్షణాతరగతులు మార్కెట్ కమిటీల ద్వారా ఏర్పాటు చేయాలన్నారు. రైతు బజార్లలోని స్టాల్సు కేటాయింపు పూర్తి స్థాయిలో రైతులకు మాత్రమే అందుబాటులో ఉంచాలని, ఎటువంటి పరిస్థితుల్లో దళారులకు అవకాశం కల్పించకూడదని ఎస్టేట్ అధికారులకు మార్కెట్ కమిటీ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో సహాయ వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులు జి.రమణారావు, ఉద్యానవన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.వి.ఎస్. రవికుమార్, మార్కెటింగ్ డిఈఈ ఎం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలు ఎదురయ్యే సందర్భాల్లో చేపట్టాల్సిన చర్యలపై కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమం.

గ్రహణ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా ఎస్పీ

మచిలీపట్నం, జూలై22 (ఎపిఇఎంఎస్) : దేశంలో ఈనెల 22న సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడనున్న దృష్ట్యా సునామీ వంటి ఉపద్రవాలు సంభవించే ప్రమాదం ఉందని జ్యోతిష్యులు, శాస్త్రవేత్తలు ప్రకటించినందున జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా సముద్ర తీరప్రాంత ప్రజలు మత్స్య వేటకు వెళ్లకుండా చూడాల్సిందిగా పోలీస్ శాఖ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ రామకృష్ణయ్య మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

కృష్ణా జిల్లా సముద్ర తీరప్రాంతాలైన కృత్తివెన్ను, నాగాయలంక, కోడూరు, మచిలీపట్నం, తీరప్రాంతంలోని గ్రామాలకు మెరైన్ పోలీసులు, సిబ్బంది వెళ్లి అప్రమత్తం చేయాలని ఆయన కోరారు.

ఈ సందర్భంగా సముద్రంలోకి పర్యాటకులను, స్నానాలకు వెళ్లేవారిని నిరోధించాలని పోలీసులకు ఉత్తర్వులు జారీ చేశారు.

సంపూర్ణ సూర్యగ్రహణం... ఉదయం 7.30 గంటల సమయంలో దేశ రాజధాని న్యూఢిల్లీలో తీసినదీ చిత్రం.

రామారావు అరెస్టు నిరసిస్తూ జిల్లావ్యాప్త టిడిపి ధర్నాలు

మచిలీపట్నం, జూలై 22 (ఎపిఇఎంఎస్) : కొవ్వూరు ఎమ్మెల్యే టి.వి.రామారావును ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసినందుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు మంగళవారం జిల్లావ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు, ప్రదర్శనలు నిర్వహించారు. మచిలీపట్నంతోపాటు గుడివాడ, కైకలూరు, అవనిగడ్డ, నూజివీడు, నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం ప్రాంతాల్లో టిడిపి కార్యకర్తలు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రామారావుపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ తరఫున ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు, రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

రామారావు అరెస్ట్‌కు నిరసనగా టిడిపి రాస్తారోకో

నిజామాబాద్, జూలై22 (ఎపిఇఎంఎస్) : కొవ్వూరు ఎమ్మెల్యే రామారావు అరెస్టును నిరసిస్తూ జిల్లా టిడిపి, జిల్లా కేంద్రంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు.

అరగంట సాగిన రాస్తారోకోతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా టిడిపి నాయకులు చంద్రం మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం టిడిని నాయకులపై కుట్రతో కూడిన కేసులు మోపుతూ, వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమపై వేధింపులు మానకపోతే నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రాస్తారోకోలో నాయకులు, వినోద్‌కుమార్, కార్పొరేటర్లు అంబాదాస్, బాల్‌కిషన్, ఎ.శంకర్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు స్వచ్ఛందంగా సహాయపడాలి

- రాడార్ కేంద్రం డైరెక్టర్ కె. రాంచందర్‌రావు

మచిలీపట్నం, జూలై22 (ఎపిఇఎంఎస్): భూకంపాలు, సునామీలు, తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ప్రజలకు స్వచ్ఛందంగా సహాయపడవలసిన ఆవశ్యకత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉన్నదని మచిలీపట్నం రాడార్ కేంద్రం డైరెక్టర్ కె.రాంచందర్‌రావు తెలిపారు. వరల్డ్ విజన్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని టౌన్‌హాలులో మంగళవారం నిర్వహించిన ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాడార్‌కేంద్రం డైరెక్టర్ రాంచందర్‌రావు మాట్లాడుతూ తీరప్రాంతాల్లో తరచూ తుఫానులు, ఉప్పెనలు ఎక్కువగా సంభవిస్తుంటాయన్నారు. ప్రధానంగా ఈ తీరప్రాంతాల్లో నివసించే ప్రజలు ఈ సమయాల్లో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన చెప్పారు. సముద్రంలో అల్పపీడనం, వాయుగుండం వంటివి ఏర్పడినపుడు మత్స్యకారులను సముద్రంలోకి వెళ్ళకుండా చేయడంతోపాటు లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలను ప్రభుత్వం చేపడుతుందని అయితే తుఫాను, సునామీ వంటివి సంభవించిన పిదప తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని వరల్డ్ విజన్ సంస్థ గ్రామస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇవ్వడం ముదావహం అన్నారు. ఈ శిక్షణ పొందిన కార్యకర్తలు గ్రామాల్లోకి వెళ్ళి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అలాగే వాతావరణ హెచ్చరిక కేంద్రం జారీ చేసే హెచ్చరికలను గురించి ఆయా గ్రామాల్లో ముందుగా చేపట్టవలసిన చర్యలను ప్రజలను తెలియజేయాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వరల్డ్ విజన్ ప్రోగ్రాం మేనేజర్ హెరాల్డ్‌బాబు మాట్లాడుతూ మచిలీపట్నం మండల పరిధిలోని 34 గ్రామపంచాయితీల్లో 5గురు సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేసామని అలాగే 18 శివారు గ్రామాల్లో కూడా కమిటీలను ఏర్పాటు చేసామని ఈ కమిటీ సభ్యులందరికీ ఇక్కడ రెండు రోజులపాటు శిక్షణ ఇస్తున్నామని శిక్షణ అనంతరం వీరంతా ఆయా గ్రామాలకు వెళ్ళి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు తీసుకోవాలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగిస్తారని ఆయన చెప్పారు. ఈ నెల 22వ తేదీన సూర్యగ్రహణం సందర్భాన్ని పురస్కరించుకొని ఉపద్రవాలు సంభవించే అవకాశం ఉన్నదని జ్యోతిష్యులు, శాస్త్రజ్ఞులు సూచిస్తున్నందున ఈ కమిటీ సభ్యులందరూ ప్రజలను అప్రమత్తం చేయవలసిందిగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మచిలీపట్నం ఫైర్ ఆఫీసర్ వై. జగన్మోహన్ మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవలసిన చర్యలు, ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ విజన్ కో-ఆర్డినేటర్ సంగీతరావ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు పొందే విద్యార్థులు రెన్యూవల్‌కు ఆదేశం

మచిలీపట్నం, జూలై22 (ఎపిఇఎం ఎస్): మెట్రిక్ అనంతరం అందించే ఉపకార వేతనాలు తీసుకునే వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులు రెన్యూవల్ చేయించుకోవలసిందిగా జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి ఆర్. శ్రీధరరెడ్డి తెలిపారు.

లక్ష రూపాయల ఆదాయ పరిమితికి లోబడిన అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఆగస్టు 10వ తేదీలోగా ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన చెప్పారు.

2008-09 సంవత్సరంలో ఉపకార వేతనాలు, ట్యూషన్ ఫీజులు తీసుకున్న విద్యార్థులు రెన్యూవల్ కోసం తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ఆయన చెప్పారు. అర్హులైన వెనుకబడిన తరగతుల విద్యార్థుల నుండి రెన్యూవల్స్ నిమిత్తంగానీ లేదా కొత్త విద్యార్థుల నుండి ట్యూషన్ ఫీజుల నిమిత్తం గానీ సంబంధిత కళాశాలలు ఫీజు వసూలు చేయరాదన్నారు. ప్రభుత్వం నేరుగా ఈ ఫీజులను చెల్లిస్తున్నదని ఆయన చెప్పారు. సెల్ఫ్‌ఫైనాన్స్, పారామెడికల్ విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనలకు లోబడి ట్యూషన్ ఫీజులను పరిమితం చేసి చెల్లించడం జరుగుతుందన్నారు. మెడికల్, డెంటల్ కోర్సులు చదివే బి-కేటగిరి విద్యార్థులకు ఏ రకమైన ఉపకార వేతనాలు,ఫీజులను ప్రభుత్వం మంజూరు చేయడం లేదని ఆయన చెప్పారు.

ప్రధాన నగరాల్లో ట్రాఫిక్ నియంత్రణపై అధ్యయనం

అధికారులకు సిఎం ఆదేశం

హైదరాబాద్, జూలై22 (ఎపిఇఎంఎస్) : ప్రపంచంలోని ప్రధాన నగరాలలో ట్రాఫిక్ నియంత్రణపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకుగాను ముగ్గురు సభ్యులతో కమిటీని వేయనున్నట్లు సిఎం తెలిపారు. నగరంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యపై సిఎం ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై మంగళవారం సచివాలయంలో హోం శాఖ, ట్రాన్స్‌పోర్ట్, మున్సిపల్ శాఖ అధికారులతో సిఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మూడు శాఖల సమన్వయంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సిఎం ఆదేశించారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజలను రోగాల బారినుండి కాపాడాలి: కలెక్టర్

నిజామాబాద్, జూలై22 (ఎపిఇఎంఎస్) : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి, రోగాల బారిన పడకుండా ప్రజలను కాపాడాలని కలెక్టర్ సునీత కోరారు. మంగళవారం నవీపేట మండలం అబ్బాపూర్ గ్రామాన్ని ఆమె సందర్శించారు. గ్రామంలో వాంతులు, విరేచనాలతో మంగళవారం ఉదయం మరణించిన ప్రియాంక (10), కుటుంబాన్ని ఆమె సందర్శించి, ఆరామర్శించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా తదితరాలను గురించి గ్రామస్థులకు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పరిశుభ్రత పాటించని సర్పంచ్, గ్రామ కార్యదర్శిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నవీపేట మండలం కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న రోగులను ఆమె పరామర్శించారు. గ్రామంలోని అంగన్ వాడీ కార్యకర్తలు ప్రజలను ఆరోగ్య వంతంగా ఉండేందుకు వారిని చైతన్యం చేయాలని కలెక్టర్ సునీత కోరారు. ఆమె వెంట జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, ఎంపిపి సూరిబాబు ఉన్నారు.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

విజయవాడ, జూలై22 (ఎపిఇఎంఎస్): జగ్గయ్యపేటలోని ఒక సెల్‌ఫోన్ దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. సుమారు రూ. 3లక్షల విలువచేసే సెల్‌ఫోన్‌లు,రీచార్జీ కూపన్లు అపహరణకు గురయ్యాయి. ఆర్టీసీ బస్టాండు సమీపంలో గల హరిప్రియ సెల్‌ఫోన్‌ల దుకాణంలో ఈ చోరీ జరిగింది. ముందువైపు షెట్టర్‌ను గునపాలతో పగులగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు చేతికందినవన్ని దక్కించుకుని పరారయ్యారు. షాపు యజమాని కిరణ్ మంగళవారం ఉదయం దుకాణానికి వచ్చేసరికి చోరీ వెలుగు చూసింది. ఆయన ఫిర్యాదుమేరకు పోలీసులు క్లూస్‌టీం సహాయంతో ప్రాథమిక సాక్ష్యాధారాలు సేకరించారు. షాపు గుమాస్తా ఒకరిపై అనుమానంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. మైలవరంలో కూడా రెండు రోజుల క్రితం ఇదే తరహా చోరీ జరగడంతో ఏదైనా ఒకే ముఠా ఈ చోరీలకు పాల్పడుతుందా అన్న కోణం నుండి కూడా దర్యాప్తు జరుగుతోంది.

ఇ.సి కార్యాలయం ముందు పీఆర్పీ నిరసన ప్రదర్శన

సిఎం దిష్టిబొమ్మ దగ్ధం-రాస్తారోకో, స్తంభించిన ట్రాఫిక్- నేతల అరెస్టు

హైదరాబాద్, జూలై22 (ఎపిఇఎంఎస్) : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బీసీ రిజర్వేషన్లలో, డివిజన్ల పునర్విభజనలో అవకతవకలు జరిగాయని వాటిని సరిచేయాలంటూ డిమాండ్ చేస్తూ ప్రజారాజ్యం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల కమీషన్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు.

మొదట మౌన ప్రదర్శన నిర్వహించిన కార్యకర్తలు ఇ.సి కార్యాలయంలోకి చొచ్చుకు పోవడానికి చేసిన ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీనితో ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బుద్ధ భవన్ ఎదురుగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. దీనితో ట్రాఫిక్ స్తంభించిపోయింది.

వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు.

వేరుశెనగ సాగుపై సన్నగిల్లుతున్న ఆశలు

అనంతపురం, జులై 22 (నేటి నిజం ప్రతినిధి)ః అనంతపురం జిల్లాకు ప్రధాన వాణిజ్యపంటగా వుంటున్న వేరుశెనగ పంట ప్రస్తుత ఖరీఫ్‌లో కూడా రైతాంగంలో నిరాశకు గురి చేస్తోంది. వర్షం కోసం రెండు నెలలు నుండి ఎదురుచూస్తున్న రైతాంగం ఆశలు అడియాశలవుతున్నాయి. వర్షాకాలం ప్రారంభమై దాదాపు రెండు నెలలు అవుతున్నా కనీస స్థాయిలో కూడా వర్షపాతం నమోదు కాకపోవడంతో వేరుశెనగ సాగుపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు. చేసేది లేక ప్రభుత్వం సబ్సిడితో పంపిణీ చేసిన విత్తన వేరుశెనగను సైతం బయట మార్కెట్‌లో విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. వర్షాలు కురవక పోవడంతో వేరుశెనగ సాగు కోసం సిద్ధంగా వుంచిన సబ్సిడి విత్తనాలను బయట వ్యాపారులకు అమ్ముకో వాలని రైతులు ఉపక్రమిస్తుండటం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. వర్షం కోసం ఎదురుచూపులు చూస్తున్న రైతులు ఇక వర్షం వచ్చినా ప్రయోజనం నామమాత్రమేనని కొందరు ఒలచిన సబ్సిడి విత్తన కాయలను అమ్ముకొనేందుకు సిద్ధమవుతున్నారు.



కళ్లకు ఇటీవలే శస్త్ర చికిత్స చేయించుకున్న ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఇలా పార్లమెంట్ హౌస్‌లో నల్ల కళ్లద్దాలు పెట్టుకుని దర్శనమిచ్చారు.